www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
గురువారం | 20 | నవంబర్ | 2025
పేజీలు : 8

## పొంగ మంచులో ప్రయాణాలు జాగ్రత్త : ఎస్‌పి



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** శీతాకాలంలో దట్టమైన పొగమంచు కురుస్తోందని, ఇలాంటి సమయాల్లో వాహనదారులు ప్రయాణాలు చేసేటప్పుడు పలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్‌పి రోహిత్ రాజ్ సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దట్టమైన పొగమంచు కురిసే సమయంలో ప్రయాణాలు చేయడం శ్రేయస్కరం కాదన్నారు. వాహనాలు నిదానంగా నడపాలని, వేగంగా వెళ్లడం వల్ల అత్యంత పెద్దఎత్తున ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. వాహనాలకు ఫాగ్, పార్కింగ్ లైట్లతో పాటు తక్కువ బీమ్ హెడ్‌లైట్లను మాత్రమే ఉపయోగించాలని తెలిపారు. కారులో ప్రయాణించే వారు హీటర్ ఆన్ చేసుకుని ఎప్పటికప్పుడు ముందు అద్దాన్ని శుభ్రంగా చేసుకుంటూ ఉండాలన్నారు. ముందు వెళుతున్న వాహనానికి కనీసం 50 మీటర్ల దూరాన్ని పాటిస్తూ ఆ వాహనం ఇచ్చే సిగ్నల్‌ను గమనిస్తూ ఉండాలని తెలిపారు. పొగమంచు అధికంగా కురిసే సమయంలో ఓవర్ చేయడం మంచిదికాదన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు డ్రైవింగ్ చేయడం మానేసి వాహనాన్ని ప్రక్కకు ఆపుకోవడం శ్రేయస్కరమని, హాజార్డ్ లైట్లు వేసి ఉంచాలని సూచించారు. జిల్లా ప్రజల రక్షణ పోలీసులు బాధ్యతని, సురక్షిత ప్రయాణాలతో కుటుంబ భద్రంగా ఉంటుందని చెప్పారు.

# తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష



### రైతాంగాన్ని విస్మరిస్తున్న మోడీ సర్కార్
### -మీడియా సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తుందని రైతాంగాన్ని విస్మరిస్తూ మోడీ సర్కార్ పాలన సాగిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు పక్క రాష్ట్రాలకు కేంద్ర బృందాలను పంపి తెలంగాణ కు పంపకుండా వివక్ష చూపుతుందన్నారు. బుధవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ బిజెపి అధ్యక్షులు రాంచందర్‌రావు మేధావి కావచ్చు కానీ రైతాంగాన్ని అవమానపర్చవద్దన్నారు. రైతులను రెచ్చగొట్టి ప్రభుత్వాన్ని బదనాం చేయాలని బిజెపి, బిఆర్ఎస్ లు కుట్రలు పన్నుతున్నాయన్నారు. పంటలకు మద్దతు ధర ప్రకటిస్తూ కేంద్ర ప్రభుత్వం దానికి అనుగుణంగా కొనుగోలు చేయడం లేదన్నారు. పత్తి కొనుగోలు చేసే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని మంత్రి తెలిపారు. సిసిఐ ఆధ్వర్యంలో మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తామని చెబుతూనే నిబంధనలను విధిస్తుందన్నారు. జిన్నింగ్ మిల్లులను ఎల్1, ఎల్2, ఎల్ 3 పేరుతో విభజించి పత్తి కొనుగోలు జరిపిస్తున్నారన్నారు. దీనితో జిన్నింగ్ మిల్లులు సమ్మెబాట పట్టాయన్నారు. ఏడు క్వింటాళ్ల పత్తి మాత్రమే కొనుగోలు చేయాలని నిబంధన విధించడం శోచనీయమన్నారు. రైతులు పత్తిని అమ్ముకునేందుకు కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుని కేంద్రం చెప్పడంతో రైతులు మరింత ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎరువులు, పంటల కొనుగోళ్లకు సంబంధించి పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రులతో పాటు ముఖ్యమంత్రి సైతం విన్నవించినా పట్టించుకోలేదన్నారు. గత ఆరు నెలలుగా తుఫాన్లు, అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతిన్నాయని పండిన కొద్దిపాటి పంటలకు కూడా తేమ శాతం ఎక్కువగా ఉందని దానిని సవరించాలని

మిగతా 2లో..

# ఉద్యమ గుమ్మంలో శతాబ్ది సంబురం




### -బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపి వేయాలి
### -21న జిల్లాకు శతాబ్ది ఉత్సవ ప్రచార జాతా
### -నగర సమావేశంలో బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజా ఉద్యమాల గుమ్మం ఖమ్మంలో శతాబ్ది ఉత్సవ ముగింపు సంబురాలు జరుగుతున్నాయని ఇవి కమ్యూనిస్టు పార్టీ పురోభివృద్ధికి, భవిష్యత్తు ప్రజా ఉద్యమాలకు దోహదం కానున్నాయని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. సభలకు సంబంధించి విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఖమ్మం నగర సమితి సమావేశం బుధవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఎస్‌కె జానిమియా అధ్యక్షతన జరిగింది. సభలో హేమంతరావు మాట్లాడుతూ లక్షలాది మంది ప్రజలను కదిలించేందుకు శ్రేణులు పని చేస్తున్నాయని ఇంటింటికి సభ సందేశాన్ని అందజేస్తున్నామన్నారు. దేశంలో జరుగుతున్న బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే నిలిపి వేయాలని ఆయన డిమాండ్

మిగతా 2లో..

# సామినేనిది రాజకీయ హత్యే



### -నిందితులను అరెస్టు చేయకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళన
### -సిపిఎం రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు
### -25న నిరసన దీక్ష

**ప్రజాపక్షం/ఖమ్మం :** సిపిఎం నాయకుడు సామినేని రామారావు ది ముమ్మాటికి రాజకీయ హత్యేనని పోలీసులు ఈ హత్య కేసును తప్పుదారి పట్టించేందుకు ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్, బిజెపియేతర పక్షాల నాయకులు ఆరోపించారు. హత్య జరిగి 20 రోజులైనా నిందితులను అరెస్టు చేయడంలో పోలీసుల నిర్లక్ష్యం వైఖరిని నిరసిస్తూ ఈనెల 25న నిరసన దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సామినేని హత్యలో హంతకులను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో రౌండ్ టేండ్ సమావేశం ఏర్పాటు చేశారు. సిపిఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిపిఎం, సిపిఐ, బిఆర్ఎస్, సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ ఈ హత్యకేసు ఒక కుట్ర పూరిత పద్ధతిలో విచారణ జరుగుతుందని సామినేని రామారావు సతీమణి స్వరాజ్యం ఫిర్యాదును పోలీసులు పట్టించుకోకపోగా కుటుంబాన్ని, సిపిఎం పార్టీని అనుమానించడం దారుణమన్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు విశ్వసనీయత కోల్పోతున్నారని నాయకులు తెలిపారు. జిల్లా చరిత్రలో ఒక రాజకీయ నాయకున్ని సుఫారీ ఇచ్చి

మిగతా 2లో..

# తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్రం వివక్ష

**(మొదటిపేజీ తరువాయి)**
కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడలేనివిధంగా ఎంఎస్‌పికి పంటలను కొనే రాష్ట్రం తెలంగాణ మాత్రమేనన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానం మేరకు రెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. రైతుల కోసం రూ.1.06 లక్షల కోట్లను రైతుల కోసం ఖర్చు చేశామన్నారు. మన్మోహన్‌సింగ్ పాలనలో గతంలో దేశ వ్యాప్తంగా రూ.70 వేల కోట్లు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. ధాన్యం అత్యధికంగా పండిస్తున్న రాష్ట్రం దేశంలోనే తెలంగాణ మాత్రమేనన్నారు. మద్దతు ధరతో పాటు సన్న రకం వడ్లు బోనస్ కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తన వాటాను కూడా కొనుగోలు చేయడం లేదని ఆరోపించారు. పామాయిల్, పత్తి దిగుమతి సుంకాలను కేంద్రం ఎత్తి వేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూరియా సరఫరాలో కూడా కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇతర దేశాల నుంచి వచ్చే యూరియాను తెలంగాణకు కేటాయించడం వల్ల సరఫరా చేయడంలో ఆలస్యమైందన్నారు. పదేళ్ల పాలించిన బిఆర్ఎస్ రైతుల గురించి పట్టించుకోకుండా ఇప్పుడు రోడ్డుపైకి వచ్చి ఆందోళనలు చేపట్టడం హాస్యాస్పదమన్నారు. బిఆర్ఎస్ ఏనాడు రైతుల గురించి పట్టించుకోలేదన్నారు. బిజెపి, బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పై విమర్శలు చేయడం ప్రజలకు గమనిస్తున్నారని తెలిపారు. రైతాంగ ఇబ్బందులు తొలగించేందుకు బిజెపి నాయకులు ప్రయత్నించాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యమ గుమ్మంలో శతాబ్ది సంబురం




**(మొదటిపేజీ తరువాయి)**
చేశారు. దశాబ్దాల పాటు ప్రజల కొరకు పని చేసిన వారిని పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని హేమంతరావు ఆరోపించారు. మావోయిస్టు ఏరివేత పేరుతో కేంద్ర ప్రభుత్వం హింసా పూరిత చర్యలకు పాల్పడి మానవత్వాన్ని మంటగలుపుతుందన్నారు. ప్రభుత్వ వ్యతిరేక చర్యలకు పాల్పడిన వారు దొరికితే విచారించి చట్టం ద్వారా శిక్షించాలి కానీ అడవుల్లోకి తీసుకెళ్లి ఎన్‌కౌంటర్ల పేరుతో హతమార్చే హక్కు ఎవరిచ్చారని హేమంతరావు ప్రశ్నించారు. కార్పొరేట్ల కనుసన్నల్లో మోడీ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రకృతి సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే నేపంతో అడవుల నుంచి మావోయిస్టులను తరిమేస్తున్నారన్నారు. మడివి హిడ్మా సహా ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్లన్నింటిపైన న్యాయ విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. అపరిపక్వతతో కొందరు బిజెపి నాయకులు రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారని సమాజం పట్ల మావోయిస్టు ఉద్యమం పట్ల అవగాహన లేని మాటలు మాట్లాడుతున్నారని ఎర్రజెండాలను తుల నాడే ప్రయత్నం చేయడం మానుకోకపోతే ప్రజలే తగు రీతిలో బుద్ధి చెబుతారని ఆయన అన్నారు.

**21న ప్రచార జాతా...**

ఈనెల 21న సిపిఐ ప్రచార జాతా ఖమ్మంలోకి రానుందని హేమంతరావు తెలిపారు. ఈనెల 15న మహబూబ్ నగర్ జిల్లా గద్వాల్‌లో ప్రారంభమైన రెండవ జాతా, నవంబర్ 21న ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలోకి ప్రవేశించనుందన్నారు. నేలకొండపల్లి, ముదిగొండ, ఖమ్మం, వివిపాలెం, కొణిజర్ల, వైరా, తల్లాడ, ఏన్కూరు మీదుగా కొత్తగూడెం జిల్లాలోకి ప్రవేశిస్తుందన్నారు. దారి పొడవునా ప్రధాన కేంద్రాల్లో సభలు జరుగుతాయని హేమంతరావు తెలిపారు. ఈ జాతాకు శాసన మండలి సభ్యులు నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాల నర్సింహా నేతృత్వం వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు మహ్మద్ సలాం, జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యానాలి సాంబశివరెడ్డి, ఏరియా కార్యదర్శులు నూనె శశిధర్, వరదా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సామినేనిది రాజకీయ హత్యే










**(మొదటిపేజీ తరువాయి)** హత్య చేయించిన ఘటన ఈ ప్రాంతంలో ఏనాడు జరగలేదని అయినా ఈ కేసును అధికార పార్టీ ఒత్తిళ్లతో నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కిరాయి హత్యల సంస్కృతి అత్యంత ప్రమాదమని దీనిపై అధికార పార్టీ సైతం ఆలోచన చేయాలన్నారు. మధిర నియోజక వర్గంలో వరుసగా మూడు హత్యలు జరగడం ముగ్గురు సిపిఎం పార్టీకి చెందిన వారే కావడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఒత్తిడి కారణంగానే విచారణలో జాప్యం జరిగి నిందితులను బహిర్గతం చేయడం లేదన్నారు. మల్లు నందిని మెప్పు కోసం పోలీస్ యంత్రాంగం పని చేస్తుందని పలువురు ఆరోపించారు. రామారావు హత్య కేసు పక్కదారి పట్టేలా విచారణ జరగడాన్ని నిరసిస్తూ ఈనెల 25న నిరసన దీక్ష చేపట్టాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, ఎంఎల్‌సి తాతా మధుసూదన్, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, జెడ్పి మాజీ ఛైర్మన్ లింగాల కమల్‌రాజ్, మాస్ లైన్ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, న్యూడెమోక్రసీ నాయకులు లక్ష్మి నారాయణ తదితరులు మాట్లాడగా టిడిపి నాయకులు కేతినేని హరీష్, సామినేని రామారావు కుమారుడు విజయ్, సిపిఎం నాయకులు కళ్యాణం వెంకటేశ్వరరావు, మాచర్ల భారతి, బండి రమేష్, విక్రం, బొంతు రాంబాబు, మాదినేని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

**ప్రజాపక్షం/పాల్వంచ :** విద్యార్థుల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని ఆర్‌సిఓ రాంబాబు అన్నారు. పాత పాల్వంచ జ్యోతి నగర్‌లోని మహాత్మాజ్యోతీభా పూలే బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ముందుగా పాఠశాల నుండి అదృశ్యమైన బాలికల వివరాలను అడిగి తెలుసుకొన్నారు. వంట గదిని, పరిసరాలను పరిశీలించారు. గుడ్ల బరువును తూకం వేసి చూశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల బాధ్యత మనపై ఉందన్నారు. వారి పట్ల నిర్లక్ష్యం తగదన్నారు. లేనిచో శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి కనీస అవసరాల పట్ల దృష్టి సారించాలని సూచించారు. దీనికి ప్రిన్సిపాల్ బాధ్యత వహించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ క్రాంతి, వార్డెన్ సుప్రియ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో ఇద్దరికి జైలు శిక్ష

### -రెడులక్షలు జరిమానా

**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** గంజాయి తరలిస్తూ పట్టుబడిన ఇద్దరికి 20 ఏళ్ల జైలుశిక్ష, ఒక్కొక్కరికి లక్షరూపాయలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె.ఉమాదేవి తీర్పుఇచ్చినట్లు పోలీసుకమిషనర్ సునీల్‌దత్ ప్రకటనలో తెలిపారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కొణిజర్ల మండలం గద్దలగూడెంకు చెందిన తమ్మిశెట్టి ఆనంద్, జూలూరుపాడు మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన గుగులోతు బావసింగ్ అలియాస్ శంకర్‌లు జల్సాలకు అలవాటుపడి నగదు కోసం గంజాయిని అక్రమంగా విక్రయిస్తూ అవసరాలు తీర్చుకుంటున్నారు. వీరిరువురూ సిలేరు నుంచి గంజాయిని తీసుకువచ్చి గద్దలగూడెం గ్రామ శివారు పొలాల్లో దాచారు. 2020 డిసెంబర్ 4వ తేదిన సుమారు 50 కిలోల గంజాయిని ఒక ఆటోలో ఇతర ప్రాంతాలకు విక్రయించేందుకు తీసుకువెళ్తుండగా కొణిజర్లలో వాహనాలు తనిఖీచేస్తున్న పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై అక్కడి పోలీసులు ఎన్‌డిపిఎస్ యాక్ట్ 1985 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. పరిశీలించిన న్యాయమూర్తి ఉమాదేవి నిందితులపై మోపిన అభియోగం రుజువు కావడంతో ఇరవై ఏళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి లక్షరూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్‌కు సహకరించిన విచారణ అధికారులు అప్పటి సిఐ వసంతకుమార్, ప్రస్తుత ఇన్‌స్పెక్టర్, అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ జె. శరత్‌కుమార్ రెడ్డి, ఎస్సై మొగిలి, కోర్టు కానిస్టేబుల్ రామారావు, కోర్టు లైజనింగ్ (ఎస్ఐ) కె. శ్రీకాంత్, హెడ్‌కానిస్టేబుల్ మల్లికార్జునరావు, శ్రీనివాస్, నాగేశ్వరరావు, హోంగార్డ్ ఆఫీసర్ ఎండి ఆయూబ్ లను పోలీసు కమిషనర్ సునీల్‌దత్ అభినందించారు.

# స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ విద్యార్థుల ఎడ్యుకేషనల్ ట్రిప్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :**



ఖమ్మం నగరంలోని శ్రీనగర్ కాలనీలో గల స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ విద్యార్థులకు ప్రత్యక్ష అభ్యసన అనుభవాలు కల్పించుటకు స్టెమ్‌స్పార్క్ రెజొనెన్స్ స్కూల్ యాజమాన్యం ఫీల్డ్‌ట్రిప్‌లను నిర్వహించడం జరిగిందని స్కూల్ డైరెక్టర్ కొండా శ్రీధర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథాలను పెంపొందించుటకు ఫీల్డ్‌ట్రిప్స్ ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తరగతి గదిలో నేర్చుకున్న విషయాలను ప్రత్యక్షంగా చూడటం వలన సంపూర్ణమైన జ్ఞానాన్ని పొంది సృజనాత్మకత నైపుణ్యాలను పెంపొందించుటకు విద్యార్థులకు ఫీల్డ్‌ట్రిప్ నిర్వహిస్తున్నామని తెలిపారు. స్టెమ్‌స్పార్క్ విద్యార్థులకు పాడి పరిశ్రమ పాల ఉత్పత్తి, నిల్వ చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించుటకు విజయ డెయిరీ కేంద్రాన్ని సందర్శించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పివిఆర్ మురళిమోహన్, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టేబుల్ టెన్నిస్ విజేతగా ఎస్‌బిఐటి విద్యార్థి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లా స్థాయి టెన్నిస్ పోటీల్లో తమ కళాశాలకు చెందిన ఎంబిఏ మొదటి సంవత్సరం విద్యార్థి రెడ్డి సాయిశివ మొదటి స్థానంలో నిలిచాడని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. స్థానిక సర్దార్ పటేల్ మైదానంలో నిర్వహించిన పోటీల్లో జిల్లాకు చెందిన వివిధ ప్రాంతాల నుండి సుమారు 200 మంది క్రీడాకారులు పాల్గొనగా సాయిశివ మొదటి స్థానంలో నిలవడం తమ కళాశాలకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా విజేత సాయిశివను కళాశాల యాజమాన్యం అభినందించి సత్కరించారు. విద్యతో పాటు తమ కళాశాల విద్యార్థులకు క్రీడలపై ప్రత్యేక శిక్షణను అందిస్తూ ప్రోత్సహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి. ధాత్రి తెలిపారు. విద్యార్థులకు నిరంతరం కేవలం విద్య పట్లనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు వారి మానసిక ఉల్లాసానికి ఎంతగానో తోడ్పడతాయని కళాశాల ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, జే. రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

# వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ

**ప్రజాపక్షం/వైరా:**



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఇంటర్ విద్యా డైరెక్టర్ వారి ఆదేశానుసారం బుధవారం వైరా పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేసినట్లు కళాశాల యాంటీ డ్రగ్స్ కమిటీ సభ్యులు స్వప్న తెలిపారు. స్థానిక ప్రభుత్వ కళాశాల ఆవరణలో కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీన్‌జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం ప్రభుత్వం పంపించిన మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ 2025ను విద్యార్థులు, అధ్యాపకులు చేత ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా కాబోయే భావిభారత పౌరులైన విద్యార్థులు మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రభుత్వం వారికి సహకరించాలని, ప్రిన్సిపాల్ విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు బాసటగా బిఆర్ఎస్ పోరుబాట



-పంటల కొనుగోలులో పాలకుల తీరుపై మండిపాటు
-పత్తి పంటకు మద్దతు ధర రూ. 8,110 చెల్లించాలని డిమాండ్
-రైతుల సమస్యలు తెలుసుకున్న వద్దిరాజు రవిచంద్ర



ప్రజాపక్షం/జూలూరుపాడు: పత్తి పంటకు మద్దతు ధర 8110 రూపాయలు చెల్లించాలని రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర రైతుల తరుపున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తీర్చాలని డిమాండ్ చేస్తూ బుధవారం భద్రాద్రికొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలకేంద్రంలోని పత్తి మార్కెట్ యార్డ్ ను స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి సందర్శించి కొనుగోలు కేంద్రంలోని రైతులు, హమాలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల పత్తి పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయి రోడ్లు ఎక్కుతున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. పత్తి రైతు సమస్యను తెలుసు కునేందుకు తాను ఖమ్మం మార్కెట్ వస్తున్నానంటేనే చాలు ప్రభుత్వంలో కొంత కదలికి వచ్చిందని ఇది సంతోషకరమైన విషయం అని వద్దిరాజు రవిచంద్ర పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 2.25 లక్షల ఎకరాలలో పత్తి సాగు చేశారని ఆకస్మాత్తుగా సి.సి.ఐ. కేంద్రాలు, జిన్నింగ్ మిల్లులు కొనుగోలు నిలిపివేయ దంతో రైతులు పడిగాపులు కాస్తున్నారని దుయ్యబట్టారు. కె.సి.ఆర్ హయాంలో మద్దతు ధరతో రైతులు మహారాజులాగా బ్రతికితే కాంగ్రెస్ పార్టీ హయాంలో రైతులు ఆత్మ హత్యలకు పాల్పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా వ్యాప్తంగా పత్తికి మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

**జెండా పాట లేకుండానే పత్తి కొనుగోళ్లు...**

మార్కెట్ అధికారుల పర్యవేక్షణలో జరగాల్సిన జెండా పాట లేకుండానే ట్రేడర్స్ పత్తిని కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్ యార్డ్ విద్యుత్, నీటి సదుపాయాలు లేక రైతులు, హమాలీలు అవస్థలు పడుతున్నారు. శాశ్వత మార్కెట్ కు ప్రభుత్వం 10 ఎకరాల భూమిని అప్పగించిన పనులు ప్రారంభించలేదు. భద్రాచలం, కుంట, సుజాతనగర్ తదితర దూర ప్రాంతాల నుండి రోజు కు సుమారు 3 వేల క్వింటాల (30 లారీల) పత్తి కొనుగోలు జరుగుతున్న అధికారులు పర్యవేక్షణ లేదని. లైసెన్స్ పొందిన ట్రేడర్స్ క్వింట పత్తి 5000 నుండి 6500 వరకు కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అధికారులు పట్టించుకోక పోవడంతో సెస్, జీఎస్టీ రూపంలో ప్రభుత్వ ఆధాయానికి గండిపడుతుంది. ప్రస్తుతం జూలూరుపాడు గ్రామ పంచాయితీ క్రీడా ప్రాంగణంలో కొంటర్లను ఏర్పాటు చేసి కొనుగోలు చేస్తున్న, స్థలం సరిపోక, అక్కడ సరైన వసతులు హమాలీలకు తిండి తినటానికి, రైతులు ఉండటానికి కనీస సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు.

**ఎన్నడూ లేనంత దారుణంగా పత్తి రైతు పరిస్థితి...**

చరిత్రలో ఎప్పుడూ లేనంత దారుణంగా పత్తి రైతుల పరిస్థితి మారిందని వద్దిరాజు రవిచంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. కిసాన్ కపాస్ యాప్ అదో దిక్కుమాలిన యాప్ పని, మొబైల్ అప్లికేషన్ అని తీసుకువచ్చి దాని ద్వారానే పంటలు కొంటాం అంటున్నారు. మరి కనీసం ఫోన్లు లేని రైతన్నల పరిస్థితి ఏమిటని రవిచంద్ర ప్రశ్నించారు. కపాస్ యాప్ తీసుకొచ్చి రైతు లను గందరగోళం చేస్తుందని ఆంక్షలు ఎత్తివేసి రైతులు పండించిన పంటను మొత్తం ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేశారు. రైతులకు అన్యాయం జరుగుతుంటే ఊరుకునేది లేదన్నారు. రైతన్నల సమస్యల పరిష్కారానికి పోరాటాలు ఒక్కటే మార్గం అని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఒత్తిడి తెచ్చేందుకు పార్టీ సంసిద్ధంగా ఉన్నదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, నియోజకవర్గనాయకులు, లకావత్ గిరిబాబు, మండల అధ్యక్షులు చాపలమడుగు రాంమూర్తి, యదళ్లపల్లి వీరబద్రం, పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

-ఉభయ జిల్లాల్లో 125 మందికి లబ్ధి



ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఖమ్మం ప్రైవేట్ కార్పొరేట్ హాస్పిటల్లో అత్యవసరమైన వైద్య చికిత్స పొందిన పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు ఖమ్మం ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి ఉభయ జిల్లాల్లో 125 మంది లబ్ధిదారులకు మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం నగరంలోని గట్టయ్య సెంటర్లో గల క్యాంప్ కార్యాలయంలో పంపిణీ చేశారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల లబ్ధిదారులకు రూ. 40 లక్షల మేరకు లబ్ధి చేకూరించ్చారు. ఈ సందర్భంగా ఎంపి రఘురాం రెడ్డి మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం భరోసాగా నిలుస్తుందన్నారు. అత్యవసర వైద్య చికిత్సల కోసం ఇప్పటికే అనేక మందికి ఎల్ఓసిలు మంజూరు చేశామన్నారు. అర్హులైన పేదలందరికీ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లబ్ధి కలిగేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, మద్ది మల్లారెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, టిపిసి సభ్యులు ఉమ్మినేని కృష్ణ, ఇమామ్ బాయ్, పలువురు కార్పొరేటర్లు, ప్రజా సంఘాల బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గురుకులాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి

విలేకరుల సమావేశంలో జిపిఎ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోట లోకేష్




ప్రజాపక్షం/ మధిర : తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బిసి గురుకులాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహించాలని గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోటా లోకేష్, జిల్లా అధ్యక్షులు గొల్లమందల శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మధిర పట్టణం మెయిన్ రోడ్డులోని మధిర ప్రెస్ క్లబ్ కార్యాలయం నందు జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రేవంత్ సర్కార్ వచ్చిన తర్వాత గురుకులాల్లో మెస్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు పెంచడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకువచ్చిన కొన్ని మార్పుల వలన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రోజుకు 25మంది విద్యార్థులను వంట దగ్గర ఒకరిని పనిలో ఉంచడం వలన వారి చదువుపై తీవ్రమైన ప్రభావం పడుతోందని, వెంటనే ఈ విధానాన్ని రద్దు చేయాలన్నారు. అదేవిధంగా గురుకులాలకు ప్రతి సంవత్సరం వచ్చే పిఎంసి నిధులపై అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, దీంతో అనేక నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, జిల్లా వారీగా ఒక ఆర్సిఓని నియమించి పర్యవేక్షణ చేయాలని అన్నారు. గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన విద్యను అందిస్తున్నప్పటికీ విద్యార్థులకు యూనిఫాం, సరైన ఆహారం అందటం లేదని, అనేక చోట్ల ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు, ఫుడ్ పాయిజన్ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు ప్రభుత్వం వెంటనే ఫుడ్ కమీషన్ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో చదివే విద్యార్థుల నైపుణ్యాన్ని గుర్తించి వారికి అవసరమైన వసతులు కల్పించాలని, అలాగే విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఎటువంటి ప్రాణనష్టం జరుగకుండా ఉండేందుకు అంబులెన్స్ను ఏర్పాటు చేయాలని, గురుకుల పాఠశాలలను అధికారికంగా ఒక ప్రభుత్వ శాఖగా ప్రకటించాలని కోరారు. గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ కమిటీ విద్యార్థుల సంక్షేమం కోసం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గురుకుల పేరెంట్స్ కమిటీ మధిర మండల అధ్యక్షులు కనకపూడి రాము, దర్శి కిరణ్ పాల్గొన్నారు.

# మౌనికకు బంగారు పథకం



ప్రజాపక్షం/సత్తుపల్లి: మండల పరిధిలోని బేతుపల్లి గ్రామానికి చెందిన వేణునూతుల మౌనిక భగవద్గీత పఠనంలో అసమాన ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. బేతుపల్లి అంకమ్మ తల్లి ఆలయం పూజారి విజయ్ బాబు ధర్మపత్ని వేణునూతుల మౌనిక భగవద్గీతలో గల 18 అధ్యాయాలలోని 700శ్లోకాలను కంఠస్థం చేశారు. ఇటీవల ఆన్లైన్ లో నిర్వహించిన పోటీలో పాల్గొన్న మౌనిక బగవద్గీత పఠనంలో ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. బంగారు పతకాన్ని మైసూరు దత్త పీఠాధిపతి సచ్చిదానంద స్వామి చేతుల మీదుగా స్వీకరించనున్నట్లు మౌనిక బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విజయాన్ని తన గురువు మాదుగుల రమ్యకు అంకితం చేస్తున్నట్లు తెలియజేశారు. బంగారు పథకాన్ని సాధించిన మౌనికను బేతుపల్లి గ్రామ పెద్దలు, ప్రజలు అభినందించారు.

# గంజాయి కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ : గంజాయి కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ బుధవారం ఖమ్మం మొదటి అదనపు న్యాయమూర్తి కె. ఉమాదేవి తీర్పునిచ్చారు. ఈ కేసులో మిగిలిన నిందితులు పరారీలో ఉన్నారు. వివరాల్లోకి వెళితే... 2020 డిసెంబర్ నాలుగున పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా ఆటోలో అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరిని ప్రశ్నించి ఆటోను తనిఖీ చేశారు. వైజాగ్లో గంజాయి కొనుగోలు చేసి హైదరాబాద్కు అక్రమంగా తరలిస్తూ మూడు బ్యాగుల్లో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ. 7.50 లక్షలుగా అప్పట్లో నిర్ధారించారు. దీనిపై కొణిజర్ల పోలీసులు కేసు నమోదు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితులపై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జమ్ముల శరత్కుమార్రెడ్డి వాదించగా , లైజనింగ్ అధికారి శ్రీకాంత్, మల్లికార్జునరావు, రామారావు, హోంగార్డ్ అయూబ్ లు సహకరించారు.

# గీతపనివార్ల సదస్సును జయప్రదం చేయండి



ప్రజాపక్షం/ ఖమ్మం : గీతపనివార్ల సమస్యలను పరిష్క రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న హైదరాబాద్లో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని గీతపనివార్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తొండల సత్యనారాయణ, దూసరి శ్రీరాములు కోరారు. బుధవారం సదస్సు పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, శ్రీరాములు మాట్లాడుతూ గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందిందన్నారు. గీత కార్మికులకు చెల్లించాల్సిన రూ. 13 కోట్లను తక్షణం విడుదల చేయాలని కోరారు. గీతవృత్తి రక్షణ, సంక్షేమానికి ప్రత్యేక చట్టాలు చేయాలని వారు కోరారు. రాజ్యాంగ సవరణ ద్వారా బిసిలకు 42 శాతం రిజర్వేషన్ను అమలు చేయాలన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథులుగా పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, గీతపనివార్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మగాని ప్రభాకర్, సాయిల్ గౌడ్, సదానంద గౌడ్ తదితరులు పాల్గొంటారని వారు తెలిపారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో గీతపనివార్ల సంఘం నాయకులు చేబ్రోలు ఇంద్రసేన, నాగేశ్వరరావు, వాసు, సైదా తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురంలో గల జీబీఆర్ ఫంక్షన్ హాల్లో నేడు ఎస్ఎఫ్ 47వ జిల్లా మహాసభలు నేడు జరుగుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు పోనుకుల సుధాకర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనికి జిల్లా, రాష్ట్ర నాయకులు, 200మంది డెలిగేట్స్ హాజరవుతున్నారన్నారు. విజయవంతానికై అన్ని ఏర్పాట్లను చేసినట్లు పేర్కొన్నారు. ఈ మహాసభ భవిష్యత్తు విద్యారంగ సమస్యల పరిష్కార వేదిక కాబోతుందన్నారు.

# రోడ్లపై గుంతలను పూడ్చాలని బిఆర్ఎస్ వినతి



ప్రజాపక్షం/అశ్వారావుపేట : అశ్వారావుపేట మండలంలో రోడ్లన్ని గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, ప్రభుత్వం తక్షణమే స్పందించి గుంతలను పూడ్చాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్య క్షులు జుజ్జూరి వెంకన్నబాబు డిమాండ్ చేశారు. బుధవారం అశ్వారావుపేట స్థానిక రింగ్ రోడ్డు సెంటర్ నుండి బైకు ర్యాలీగా వెళ్లి ఎంపిడిఓ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న అనేక రోడ్లు గుంతలతో ప్రమాదకరంగా మారాయని, తక్షణమే గుంతలను పూడ్చాలని, లేనిపక్షంలో ఆందోళనను ఉదృతం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో అభివృద్ధి ఫలాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాయని కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజలను ఏమాత్రం పట్టించుకోవటం లేదని, సమస్యలను గాలికొదిలేశారని, రహదారుల మరమ్మత్తులు చేయటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు రఘురాం, ఎస్.వీ.రాజు, ఎన్.వెంకన్నబాబు, ఎం.హుస్సేన్, నవీన్నాయక్, హెచ్ వంశీనాయక్, తూంపాటి రమేష్, సూరిబాబు, పొనుగంటి లక్ష్మ ణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



ప్రజాపక్షం/ఇల్లందు: ఇందిరా గాంధీ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంఎల్ఏ క్యాంప్ కార్యాలయం నందు బుధవారం నిర్వహించారు. ఇల్లందు ఎంఎల్ఏ కోరం కనకయ్య ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరా గాంధీ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తుందన్నారు. ఇందిరా గాంధీ దేశ అభివృద్ధి కోసం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. గరీబ్ హటావో అనే నినాదంతో దేశంలో పేదరిక నిర్మూలనకు ఎంతో కృషి చేశారన్నారు. ప్రజల దీవెనలతో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ బానోత్ రాంబాబు, కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, దొడ్డ డేనియల్ , పులి సైదులు, చిల్ల శ్రీనివాస్, బోళ్ళ సూర్యం, దమ్మలపాటి వెంకటేశ్వరరావు, యదలపల్లి అనసూర్య, పూనం సురేందర్, బొల్లి రాజు, బాదావత్ సరోజ, తదితరులు పాల్గొన్నారు.

## అటవి సంరక్షణ మన బాధ్యత : డిఎఫ్ఓ



ప్రజాపక్షం/జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు ఫారెస్ట్ రేంజ్ నందు జిల్లా అటవీ అధికారి జి. కృష్ణగౌడ్, డివిజనల్ ఫారెస్ట్ అధికారి యు. కోటేశ్వరరావు బుధవారం సాధారణ విధులలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా రాజారావుపేట బీట్ పరిధిలోని గత సంవత్సరం వేసిన ప్లాంటేషన్ ను, వినోబా నగర్ బీట్ పరిధిలోని రెండు సంవత్సరాల క్రితం నాటిన ప్లాంటేషన్ లను పరిశీలించారు. మొక్కలను అనంతరం రాజారావుపేట బీట్ లో గల నాచురల్ ఫారెస్ట్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులు ఫారెస్ట్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫారెస్ట్ అభివృద్ధి పనులలో తీసుకోవలసిన జాగ్రత్తలు ఫారెస్ట్‌లో ఇంటర్ ఫ్లమ్మింగ్, ట్రాక్టర్లతో దున్నుంచి కలుపు మొక్కలు త్వరగా తీపించాలని ఫారెస్టు సిబ్బంది ఫారెస్ట్ ప్రొటెక్షన్ లో భాగంగా నిరంతరం పర్యవేక్షణ చేయాలని విధులలో ఆటంకం కలిగితే తక్షణమే రేంజ్ అధికారికి తెలియపరచాలని అడవులను అక్రమంగా నరికే వారిపై దృష్టి సారించాలని అన్నారు. అడవి శాఖ సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించుకోవాలని తమ పరిధిలో ఉన్న ప్లాంటేషన్ మొక్కల సంరక్షణ చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఆర్ ఓ ప్రసాద్ రావు, సిబ్బంది మల్లయ్య, రేఖ, కిషన్, రహీం, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై విద్యార్థులకు అవగాహన అవసరం



ప్రజాపక్షం/వైరా: స్థానిక మేరీ ఇమ్మాక్యులేట్ పాఠశాలలో బుధవారం ఖమ్మం భరోసా కేంద్రం ఇంచార్జి ఎస్సై ఎస్‌డి షాహినా పాల్గొని విద్యార్థులకు ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఎడదారి పట్టకుండా ఉంటారన్నారు. పాఠశాలా స్థాయిలోనే ఉపాధ్యాయులు విద్యార్థులకు మంచి చెడు విషయాలపై అవగాహన కలిగించాలని సూచించారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని మంచి కోసం వాడాలని చెడు విషయాల పట్ల దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ మీనా, హెచ్ఎం సిస్టర్ యమునా, సిబ్బంది సిస్టర్ జసింత, ప్రదీప, భరోసా కేంద్రం సభ్యులు సునీత, ఏఎన్ఎం కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

## పిఎం కిసాన్ సమ్మాన్ ప్రత్యేక ప్రసారం



ప్రజాపక్షం/వైరా: వైరా కృషి విజ్ఞాన కేంద్రంలో రూ.18వేల కోట్లను నేరుగా పిఎం కిసాన్ సమ్మాన్ నిధి 21వ విడతలో రైతుల ఖాతాలోకి నగదు బదిలీ కార్యక్రమం ప్రత్యక్ష ప్రసార దృశ్య వీక్షణం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వైరా టి.కరుణశ్రీ, వైరా మండల వ్యవసాయ అధికారి మంజుఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కరుణశ్రీ వేసుకోవాల్సిన పంటలు, ప్రభుత్వ పథకాల గురించి తెలిపారు. కెవికె వైరా ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ సుచరితదేవి రైతులను ఉద్దేశించి పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను వివరించారు. డాక్టర్ కె.పావని, కీటక శాస్త్రవేత్త ప్రస్తుత పరిస్థితుల్లో వివిధ పంటల్లోని చీడపీడలు వాటి నివారణ గురించి వివరించారు. డాక్టర్ వి.చైతన్య, ఉద్యానశాస్త్రవేత్త రబీలో వేసుకోవాల్సిన వివిధ ఉద్యాన పంటల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## శతాబ్ది ఉత్సవ బస్సు జాతా ముగింపు సభను జయప్రదం చేయండి

**- 22న భద్రాచలంలో ముగింపు సభ**
**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**



ప్రజాపక్షం/భద్రాచలం : సిపిఐ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదిలాబాద్ జిల్లా జోడ్‌ఘాట్‌లో ప్రారంభమైన బస్సు జాత ఈనెల 22న భద్రాచలంలో జరిగే బహిరంగ సభతో ముగుస్తుందని, ఈ కార్యక్రమాన్ని జయప్రథం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ, కౌన్సిల్ ముఖ్యుల అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ బస్సు జాత ఈనెల 21న జిల్లాలోని ఇల్లెందు నియోజకవర్గంలోనికి ప్రవేశింస్తుందని, ఇల్లెందు పట్టణంలో భారీ ర్యాలీతోపాటు బహిరంగ సభ ఉంటుందన్నారు. మీదుగా పాల్వంచలోనికి ప్రవేశిస్తుందని, పాల్వంచలో మోటార్ సైకిల్ ర్యాలీ, సభ ఉంటుందన్నారు. అదే రోజు బూర్గంపాడు మండలంలోనికి ప్రవేశింటి ఐటిసి పిఎస్‌పిడి అతిధి గృహంలో రాత్రిబస చేస్తారని తెలిపారు. 22వ తేది ఉ.9 గం.లకు సారపాక సెంటర్‌లో సభ ఉంటుందని, గోదావరి బ్రిడ్జీ మీదుగా భద్రాచలం పట్టంలోకి ప్రవేశిస్తుందని చెప్పారు. భద్రాచలం పట్టణ ప్రవేశ ద్వారం వద్ద పెద్దఎత్తున బస్సు జాతాకు స్వాగతం పలుకుతారని, అక్కడ్నుంచి వందలాది మోటార్ సైకిళ్లతో పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహిస్తారని, అంబేద్కర్ సెంటర్‌లోని డా. బిఆర్ అంబేద్కర్, విప్లవ వీరుల విగ్రహాలకు పూల మాలలు వేసిన అనంతరం అక్కడే భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున కృషి చేయాలన్నారు. కమ్యూనిస్టుల పని అయిపోయిందంటూ అవాకులు చెవకాలు పేలిన వారి నోళ్లు మూతపడేలా సిపిఐ శతాబ్ది ఉత్సవాలు జరుగుతున్నాయని, వందేళ్ల పార్టీ చరిత్ర, ఉద్యమాలు, త్యాగాలను ఇంటింటికీ చేరవేయాల్సిన గురుతర బాధ్యత మనందరిపై ఉందన్నారు. డిసెంబర్ 26న ఖమ్మం కేంద్రంగా శతవసంత ఉత్సవాల ముగింపు సభ కనీవినీ ఎరుగని రీతిలో జరగనుందని, 45 దేశాల నుండి ప్రతినిధులు తరలివస్తున్నారని చెప్పారు. పేదలు,బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం భారత దేశ స్వాతంత్రానికంటే ముందే ఆవిర్భవించిన భారత కమ్యూమిస్టు పార్టీ (సిపిఐ) మరో వందేళ్లయినా ప్రజల్లో మనగలదన్నారు. ఎర్రజెండాను అంతమొందించేందుకు ఎందరో కుటిల ప్రయత్నాలు చేశారని, అర చేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని, కుట్రలు,కుతంత్రాలతో ఎర్రజెండా రెపరెపలను ఎవ్వరూ అడ్డుకోలేరని చెప్పారు. పేదల పక్షాన పోరాటాలు చేసేది ఎర్రజెండాలనే అని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్దమే అని చెప్పారు. ప్రచార జాతాలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్ఏ చాడా వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, కలవేన శంకర్, కలకోట కాంతయ్య, మణికంఠ రెడ్డి, పల్లె నర్సింహా పాల్గొంటారన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సరెడ్డి పుల్లారెడ్డి, వీశంశెట్టి పూర్ణ చంద్రరావుచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, మువ్వా వెంకటేశ్వరరావు, జిల్లా సమితి సభ్యులు రామిరెడ్డి, సబ్కా నాగేశ్వరరావు, పేరాల శ్రీనివాస్, సాధనపల్లి సతీష్, నిమ్మల రాంబాబు, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## బస్సు జాతా విజయవంతానికి ఏర్పాట్లు




ప్రజాపక్షం/ఇల్లందు: డిసెంబర్ 26న ఖమ్మం పట్టణంలో జరిగే సిపిఐ వందేళ్ళ ఉత్సవాల ముగింపు భారీ బహిరంగ సభ విజయవంతానికి పార్టీ తరపున రాష్ట్రంలో మూడు బస్సు జాతాలను ప్రారంభించామని, ఇల్లందు మండలంలో శుక్రవారం 21వ తారీఖు సాయంత్రం మూడు గంటలకు రాజీవ్‌నగర్ తండాకు చేరుకుంటుందని, దాని విజయవంతానికి ఏర్పాట్లు చేస్తున్నామని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సిపిఐ కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. బుధవారం విట్టల్ రావు భవనం నందు జరిగిన ఇల్లందు నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26న జరిగే సిపిఐ ముగింపు సభకు ఇల్లందు నియోజకవర్గం నుండి 30వేలకు పైగా జనాభాను తరలించాలని, పార్టీ అభిమానులు, సిపిఐ కార్యకర్తలు నుండి విరాళాలను సేకరించాలన్నారు. ఇల్లందు నియోజకవర్గంలో ముఖ్య మైన ప్రాంతాలలో సిపిఐ వందేళ్ళ ఉత్సవాలకు సంబంధించిన వాల్ రైటింగ్స్ రాయించాలని తెలిపారు. ప్రతి ఒక్క నాయకుడు, సిపిఐ సానుభూతిపరులు, అభిమానులు డిసెంబర్ 26న ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు హాజరయ్యే ఏర్పాట్లను సమకూర్చుకోవాలని తెలిపారు. భారతదేశానికి సంపూర్ణ స్వాంత్రం కావాలని మొట్టమొదటి పోరాటం చేసింది సిపిఐ మాత్రమేనని, నాటి నుండి నేటి వరకు పేద ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వంతో కలిసి ఉన్న నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే సారయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరకొండ శంకర్, బంధం నాగయ్య, మండల కార్యదర్శి గుగులోత్ రామచంద్రనాయక్, ఇల్లందు మండల పట్టణ కార్యదర్శులు బొప్పిశెట్టి సత్యనారాయణ, బాస శ్రీనివాసరావు, ఇల్లందు ఏరియా బ్రాంచ్ ఉపాధ్యక్షులు దాసరి రాజారామ్, సిపిఐ నాయకులు ఉడత ఐలయ్య, బొల్లి కొమరయ్య, కుమ్మరి రవీందర్, ఎస్‌కే వలి, తదితరులు పాల్గొన్నారు.

## బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

**- సిపిఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు**



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : సుప్రీంకోర్టు సింగిల్ జడ్జితో బూటకపు ఎన్‌కౌంటర్లపై తక్షణమే న్యాయ విచారణ జరిపించాలని సిపిఐఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బుధవారం ఖమ్మంరూరల్ మండలంలోని ఎం,వెంకటాయపాలెంలోని కార్యాలయంలో రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...దేశ ప్రజల సంపద, వనరులను దోచుకుంటున్న బహుళజాతి కంపెనీలకు వ్యతిరేకంగా పోరాడే నక్సల్స్‌ను ఎన్‌కౌంటర్ పేరుతో కాల్చి చంపుతున్నారని దుయ్యబట్టారు. ఉగ్రదాడులతో దేశ ప్రజలను హతమారుస్తున్న పాకిస్తాన్‌తో శాంతి చర్చలు కేంద్ర ప్రభుత్వం చేస్తుందన్నారు. కానీ ఈ దేశ బిడ్డలు న్యాయం కోసం పేద ప్రజల పక్షాన పోరాడే నక్సల్స్ శాంతి చర్చలకు వస్తామన్న ఈ దారుణాలు ఏంటని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరుతో ప్రధాని మోడీ, అమిత్‌షా నరమేధాన్ని సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్ఎస్‌ను బలోపేతం చేసుకుంటూ, కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెట్టేందుకే ఈ దాష్టీకమని విమర్శించారు. మాడావి హిడ్మాతో పాటు తదిరత బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్డు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలన్నారు. అలాగే డిసెంబర్ 26తో కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి 100సంవత్సరాలను పురస్కరించుకొబోతున్న తరుణంలో 25న హైదరాబాద్‌లోని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని జిల్లాలోని గ్రామాలలో సూచికగా జెండాలను ఆవిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర కమిటీ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర నాయకులు గుమ్మడి నర్సయ్య, నాయకులు కేజీ రామచందర్, సభ్యులు కే. రమ, వి. ప్రభాకర్, చిన్న చంద్రన్న, నందిరామయ్య, సదానందం, పిట్ల రామకృష్ణ, నాయిని రాజు, గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, సివై పుల్లయ్య, జి. రామయ్య పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆదాయానికి ఎగనామం పెడుతున్న బట్టీల యాజమాన్యం

**-లక్షల్లో పన్నులు.. కోట్లల్లో ఆదాయం**
**-నోరు మెదపని అధికార యంత్రాంగం**





ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం మండలంలో నిర్వహించే ఇటుక బట్టీల వ్యాపారస్తులు పన్నులకు ఎగనామం పెడుతు లక్షల్లో ఖర్చు చేసి కోట్లల్లో ఆదాయం సంపాదిస్తున్నారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. బట్టీలు నిర్వహిస్తున్న గ్రామ పంచాయితీలకు ఎలాంటి పన్నులు చెల్లించడం లేదనే విమర్శలు ఉన్నాయి. వ్యాపారంలో 2శాతం పన్ను చెల్లించాలనే నిబంధన ఉన్నప్పటికీ వ్యాపారస్థులు పట్టించుకోవడం లేదని, అధికారులు కూడా తమకేంటి అన్నట్లు వ్యవహారించడం పట్ల పలువురు మండిపడుతున్నారు. సామాన్యులకు ఒక న్యాయం బట్టీల యాజమానులకు ఒక న్యాయమా అంటూ బహాటంగా విమర్శిస్తున్నారు. వీరికి తోడుగానే ప్రజాప్రతినిధులు అనుసరిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏడాదిలో ప్రతి బట్టీలోనూ దాదాపు లక్ష వరకు ఇటుకలు తయారు చేసి బట్టీపెట్టి కాల్చి ఒక్కొక్కటి రూ 8 నుండి 10 రూపాయల చొప్పున మార్కెట్‌లో విక్రయిస్తారు. ఒక్కో యజమాని సీజన్‌లో అన్ని ఖర్చులు పోనూ రూ 30 నుండి 50లక్షల వరకు సంపాదించడంతో మండలంలో కోట్లలో లావాదేవీలు జరుగుతున్నాయి, అయినా పంచాయితీలకు పన్నులు చెల్లించడం లేదు. విక్రయ సమయంలో కొనుగోలు దారులకు రశీదు కూడా ఇవ్వకుండా వాణిజ్య పన్నుల శాఖకు చెల్లించాల్సిన 2శాతం, పంచాయితీ యాక్ట్ ప్రకారం గ్రామంలో జరిగే విక్రయాల్లో రెండు శాతం పంచాయితీలో జమచేయాల్సి ఉండగా వ్యాపారులు విస్మరిస్తున్నారు.

**సాధారణంగా చెల్లించాల్సిన పన్నులు....**

ఇటుకలపై సాధారణంగా 5శాతం జీఎస్టి ఉంటుంది. టర్నోవర్ పరిమితికి మించి ఉంటే ఇటుక బట్టి యజమానులు జిఎస్‌టి నమోదు చేసుకోవటానికి ఎస్‌టిఆర్ 1, జిఎస్‌టిఆర్ 3, జిబి వంటి రిటర్నులు ఫైల్ చేయాలి. బట్టి ద్వారా వచ్చే లాభాలపై ఆదాయ పన్ను వర్తిస్తుంది. యజమాని వ్యక్తిగతంగా లేదా కంపెనీ రూపంలో నడిపినా పన్ను చెల్లించాలి. ఇటుక తయారీకి మట్టి ఉపయోగిస్తారు. అందుకే భూమి నుండి మట్టి తీసుకోవడానికి రాయల్టీ లేదా లైసెన్స్ ఫీజు చెల్లించాలి. ఇది రాష్ట్ర మైనింగ్ విభాగం వసూలు చేస్తుంది. పర్యావరణ అనుమతులు పొల్యూషన్ బోర్డ్ నుండి అనుమతి అవసరం. పర్యావరణ క్లియరెన్స్, ఎన్వోసి, ఎమిషన్ స్టాండర్ట్స్ పాటించాలి. వీటికి ఫీజులు ఉంటాయి. భవన, భూమి పన్ను లాంటివి అనగా గ్రామ పంచాయితీలలో లేదా మున్సిపాలిటీ పరిధిలో అయితే స్థానిక పన్నులు చెల్లించాలి. యజమాని కార్మికులను నియమించాల్సి వస్తే ముందుగా ఈఎస్ఐ, ఈపిఎఫ్, సిఎల్ఆర్ఏ మినిమం వేజెస్ లాంటివి కార్మికులకు కల్పించాలి.

**పన్నులు చెల్లిస్తున్నారా?...ఎగ్గొడుతున్నారా?**

బట్టి యజమానులు పన్నులు చెల్లిస్తున్నారా ఎగ్గొడుతున్నారా అనే సందేహం లేకపోలేదు. జిఎస్టి రిజిస్ట్రేషన్ చేయకపోవడం అమ్మకాల్ని బుక్ చేయకపోవడం, రాయల్టీ చెల్లించకుండా మట్టి తీసుకోవడం, కార్మికులకు కనీస వేతనం ఇవ్వకపోవడం వంటి పనులు చేస్తుంటారు. ఇవన్నీ చట్టపరంగా నేరాలు, భారీ జరిమానాలు కేసులు పడే అవకాశాలు ఉన్నాయి. పన్నులు ఎగ్గొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న యజమాన్యంపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని, అధికారులు బట్టిలపై ఖచ్చితమైన పర్యవేక్షణ ఉండాలని మండల ప్రజలు కోరుతున్నారు.

## రహదారులకు మరమ్మతులు చేపట్టాలి



ప్రజాపక్షం/బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలో గుంతలమయమైన రహదారులకు మరమ్మతులు చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి అన్నారు. బుధవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, పినపాక మాజీ ఎంఎల్ఏ రేగా కాంతారావు ఆదేశాల మేరకు ఆయన ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలంలో గుంతలమయమైనా ప్రధాన రహదారులు, లింక్ రోడ్డులు మరమ్మతులు చేయాలని, బిఆర్ఎస్ పార్టీ తరపున మండల కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్ నుండి ర్యాలీగా వెళ్లి బూర్గంపాడు మండల పరిషత్ అధికారికి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంతల మయంగా ఉన్న రహదారులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గుంతల రహదారులతో ప్రమాదాలు సైతం జరిగి హాస్పిటల్‌పాలు అవుతున్నారని తెలిపారు. వెంటనే రహదారులను మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు మేడగం లక్ష్మీ నారాయణరెడ్డి, బండారు లక్ష్మీ నారాయణ, పొడియం నరేంద్ర, బిఆర్‌టియూ నాయకులు సానికొమ్ము శంకర్‌రెడ్డి, మాజీ జెడ్‌పిటిసి భూపల్లి నరసింహారావు, మాజీ ఎంపిటిసి జక్కం సర్వేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ బోరం శ్రీనివాస్‌రావు, సారపాక టౌన్ ప్రెసిడెంట్ కొనకంచి శ్రీను, బొల్లు సాంబశివరావు, చల్లకోటి పూర్ణచందర్‌రావు, లక్ష్మీ చైతన్యరెడ్డి, మాజీ ఏఎంసి డైరెక్టర్ బానోత్ శ్రీను, తుపాకుల రవి, సాధిక్ పాషా, ఆంజినేయులు, పాటి అశోక్, పంగి సురేష్, క్రరీ నాగేశ్వరరావు, బొబ్బిలి, గుల్‌మొహ్మద్, నిమ్మల వెంకటేశ్వర్లు, నీలోఫర్, అరుణ్ ప్రసాద్, దాసు, మాజీ ఎంపిటిసి వెంకటరమణ, కే వెంకటేశ్వర్లు, షైక్ బికారి, తోకల నాగరాజు, శ్రీను, జీ అశోక్, టిప్పు సుల్తాన్, రంజిత్, కోట జయ రాజు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## సొంత ఖర్చులతో రహదారి నిర్మాణం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: పండించిన పంట మార్కెట్‌కు తోలాలన్నా రహదారి కావాలి, ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఎదురు చూసి ఆశపడకు అన్నట్లు రహదారి నిర్మాణం కోసం ఇన్ని రోజులు ఎదురు చూసినా గ్రామస్తులు చివరకు ఎవరూ రారు ఎవరు పోయరు మనమే నిర్మించుకుందామని నిర్ణయించుకొని తలా కొన్ని రూపాయలు వేసుకొని సొంత ట్రాక్టర్లతో ఆళ్లపల్లి పోలీసుల సహకారంతో బుధవారం మండల పరిధిలోని లక్ష్మీ పురం గ్రామం నుండి పెద వెంకటాపురం గ్రామం వరకు పెద వెంకటాపురం గ్రామస్తులు రహదారి నిర్మించుకున్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ఎంతో మంది పాలకులు మారిన రహదారి నిర్మాణం జరగడం లేదని, గుంతల మయంగా ఉన్న రహదారితో రోజు ప్రయాణం చేయాలంటే చాలా ఇబ్బందిగా ఉందని, పండించిన పంట ఈ గుంతల రహదారిలో తీసుకువెళ్లాలంటే ఎక్కడ పల్టీ కొట్టి ప్రమాదం జరుగుతుందోనని రహదారి నిర్మాణం కోసం ఇన్ని రోజులు వేచి చూశామని కానీ ఎవరూ నిర్మించకపోవడంతో గ్రామస్తులు ఒక తాటిపైకి వచ్చి తలకొంచెం సొమ్ము వేసుకుని రహదారి నిర్మించుకుంటున్నామని తెలిపారు. స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలైన మాలాంటి గిరిజన పల్లెలను పట్టించుకునే నాథుడూ కారువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు మారిన మా తలరాతలు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు అధికారులు స్పందించి అటవీశాఖ అనుమతులు తీసుకువచ్చి మా గ్రామానికి రహదారి నిర్మించాలని వారు కోరుతున్నారు. ఈకార్యక్రమంలో స్థానిక ఎస్ఐ సోమేశ్వరరావు, పెద్ద వెంకటాపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరా గాంధీ జయంతి



ప్రజాపక్షం/బూర్గంపాడు: ఇందిరా గాంధీ జయంతి వేడుకలను సారపాకలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పినపాక నియోజకవర్గ బి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బెల్లకొండ వాసుదేవరావు, బూర్గంపాడు మాజీ మండల అధ్యక్షులు పూలపెల్లి సుధాకర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఇందిరా గాంధీ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం వారి ఆశయాలకు అనుగుణంగా పని చేస్తుందన్నారు. ఇందిరా గాంధీ దేశ అభివృద్ధి కోసం నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. గరీబ్ హటావో అనే నినాదంతో దేశంలో పేదరిక నిర్మూలనకు ఎంతో కృషి చేశారన్నారు. ప్రజల దీవెనలతో ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు ఇస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈకార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ రోడ్లకు మరమ్మతులు చేపట్టండి



ప్రజాపక్షం/చంద్రుగొండ: గుంతలమయమైన అంతర్ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బుధవారం మండల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో అశోక్‌కు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షులు దారా బాబు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాలలో రోడ్లు గుంతలమయంగా మారాయని అన్నారు. కనీసం మరమ్మతులు చేపట్టమని మొరపెట్టుకున్న పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇందిర్మమ ఇళ్లలో చేతివాటం ప్రదర్శిస్తూ రోడ్ల మరమ్మతులు విస్మరించారనీ ఆరోపించారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈకార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు నల్లమోతు వెంకటనారాయణ, భూపతి రమేష్, మేడ మోహన్‌రావు, గాదె లింగయ్య, పొండ్ల అంజన్‌రావు, వంకాయలపాటి బాబురావు, ఉప్పతల గణేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



ప్రజాపక్షం/చంద్రుగొండ: ఘనంగా మాజీ ప్రధాని, భారతరత్న ఇందిరా గాంధీ జయంతి వేడుకలను మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక ప్రధాన సెంటర్‌లో ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన, స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ మొట్టమొదటి మహిళా ప్రధానిగా భారతరత్న ఇందిరా గాంధీ పని చేశారన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించారన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ఆమె ఆశయ సాధనలో ప్రయాణిద్దామని తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోవింద్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు తుమ్మలపల్లి సురేష్, ఆ పార్టీ సీనియర్ నాయకులు అంకిరెడ్డి కృష్ణారెడ్డి, భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, కేసుబోయిన నరసింహారావు, కిరణ్‌రెడ్డి, బుంగ శ్రీను, అన్వర్, ఇమ్రాన్, బడుగు కృష్ణవేణి, ఇస్లావత్ రుక్మిణి, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ, ఎంఎల్ఏను కలిసిన కారేపల్లి కాంగ్రెస్ నాయకులు



ప్రజాపక్షం/కారేపల్లి: ఖమ్మం ఎంపీ రామసహాయం రాఘురాం రెడ్డి చేతుల మీదుగా ఖమ్మం క్యాంప్ కార్యాలయంలో కారేపల్లి మండలంలో లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందించారు. ఈసందర్భంగా కారేపల్లి కాంగ్రెస్ నాయకులు, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ వైస్ ఛైర్మన్ బొర్రా రాజా శేఖర్ సమక్షంలో ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డికి శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం కారేపల్లి శివలయం వద్ద సైడ్ డ్రైనేజీ కొరకు గ్రామ పెద్దలు భీమవరపు శ్రీనివాసరావు ఎంపికి వినతి పత్రం ఇచ్చారు. అదే విధంగా ఎంఎల్ఏ గెస్ట్ హౌస్ ఖమ్మంలో ఎంఎల్ఏ రాందాస్ నాయక్‌ని కలిసి కారేపల్లిలో సుమారు రెండు కోట్లతో సీసీ రోడ్లు వేయిస్తున్నందుకు ఎంఎల్ఏకి జిల్లా కాంగ్రెస్ నాయకులు ఇమ్మడి తిరుపతిరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బానోత్ రామ్మూర్తి, మల్లెల నాగేశ్వరరావు, గుగులోత్ శ్రీను, గుగులోత్ భీముడు, సొసైటీ డైరెక్టర్ హీరాలాల్, తోగర శ్రీను, మదబోయిన మలేష్, మేదరి రాజా పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా వాహన తనిఖీలు





ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : రాత్రి సమయంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పోలీశాఖ పటిష్ట భద్రతను కట్టుదిట్టం చేసింది. దీనిలో భాగంగా పోలీసు కమిషనర్ సునిల్‌దత్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఎస్‌హెచ్‌ఓలు వాహనాల తనిఖీ ముమ్మరం చేశారు. మంగళవారం రాత్రి ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద ఎక్కడికక్కడ వాహనాలను నిలిపి డ్రంక్‌అండ్‌డ్రైవ్‌లతో పాటు సోదాలు చేసి వాహన చోదకుల వద్ద డ్రైవింగ్ లైసెన్స్‌లు, వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేనివారికి జరిమానాలు విధించారు. మద్యంసేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు సరెండర్ చేశారు. అనుమానాస్పద వ్యక్తుల నుంచి ఫింగర్ ప్రింట్ మొబైల్ చెక్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. జిల్లాలో గుర్తించిన బ్లాక్‌స్పాట్‌ల వద్ద భారికెడ్లు, సూచిక బోర్డులు, స్టాపర్లు, సిగ్నాల్, బ్లింకింగ్ లైట్లు ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టారు. రహదారులపై ద్విచక్రవాహనదారులు నిబంధనలకు విరుద్ధంగా కొందరు యువకులు త్రిబుల్ రైడింగ్ తో పాటు మద్యం సేవించి హెల్మెట్ లేకుండా ర్యాష్ డ్రైవింగ్ చేయడం వలనే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని సిపి పేర్కొన్నారు. వారితో పాటు ఎదురుగా వచ్చే వారిని సైతం క్షతగాత్రులకు గురిచేస్తున్నారన్నారు. నిబంధనలను పట్టించని వారిపై ప్రత్యేక దృష్టి సారించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆయన ఆదేశించారు. పలు సందర్భాలో వాహనాలు మరమ్మతులతో నిలిచిపోవడంతో సదరు వాహన చోదకుడు వాహనానికి చుట్టుపక్కలా రాళ్లు, చెట్లకొమ్మలను పెడుతున్నారని రాత్రి వేళల్లో వాటిని గమనించక అటుగా వెళ్లే వాహనాల వారు వాటిని ఢీ కొడుతుండటంతో ప్రమాదాల తీవ్రత పెరుగుతోందని వెల్లడించారు.

## పేదల బతుకులు మార్చింది ఇందిరమ్మ

**నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా**



ప్రజాపక్షం/సత్తుపల్లి: పేదల బతుకులు మార్చింది ఇందరిమ్మ అని కొనియాడారు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్. ఇందిరాగాంధీ 107 జయంతి సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదురుగా గల ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఇందిరమ్మ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇందిరాగాంధీ జయంతి కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధికి బంగారు బాటలు వేసిన నాయకురాలు, భారత తొలి మహిళా ప్రధానిగా అమూల్యమైన సేవలంధించిన ఉక్కు మహిళ స్వర్గీయ ఇందిరాగాంధీ అని కొనియాడారు. గరీబ్ హటావో అనే నినాదంతో పేదల బతుకులు మార్చిన ఇందరిమ్మకు తరాలు మారినా ఆమెపై ప్రజలకున్న ప్రేమ తరగదన్నారు. ఎన్ని రాజ్యాలు వచ్చిన ఇందిరమ్మ రాజ్యమే పేదలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందిస్తుందన్నారు.ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ తోట సుజలా రాణి, మాజీ కౌన్సిలర్స్ దూదిపాళ్ళ రాంబాబు, సీనియర్ నాయకులు కమల్ పాషా, ఐ.శ్రీను, సామెలు, మహిళా నాయకురాలు కుమారి, సరోజినీ, ఎన్.ఎస్.యూ.ఐ నాయకులు సందీప్ గౌడ్, రామారావు ఆంగోతు, షరీఫ్, మానుకోట ప్రసాద్, మట్టా చెన్నారావు, రామ్మెహన్ రెడ్డి, టోపి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయం చూపించే వరకు నిరసన దీక్ష

**దీక్షకు మద్దతు తెలిపిన తాటి**



ప్రజాపక్షం/అశ్వారావుపేట : ఆదివారం అర్ధరాత్రి నిర్ధాక్షిణ్యంగా ఇళ్లు కూల్చేసిన నిరుపేదలకు న్యాయం చేయాలంటూ అశ్వారావుపేట తహశీల్దార్ కార్యాలయం ముందు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్ష బుధవారం రెండవరోజుకు చేరింది. గత ఐదారు సంవత్సరాలుగా పేద బడుగు, బలహీన వర్గాలకు చెందిన 200మంది కుటుంబాల ప్రజలు ప్రభుత్వ భూమిలో గుడిసెలు నిర్మించుకుని జీవనాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు. వారి ఇళ్లను ఆదివారం అర్ధరాత్రి ఎటువంటి సమాచారం లేకుండా రెవెన్యూ, పోలీస్ అధికారులు కూల్చివేయడం జరిగింది. వారికి ప్రభుత్వం న్యాయంచేయాలని, నిరాశ్రయులైన పేద ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించాలని, ఇళ్ల స్థలాలను కేటాయించాలని సిపిఐ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలు చేస్తున్న నిరసన దీక్షకు మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు సందర్శించి సంఘీభావం తెలిపారు. పేద ప్రజలు నివాసముంటున్న ఇళ్లను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ధాక్షిణ్యంగా కూల్చివేయటం దారుణమని అన్నారు. పేద ప్రజలను ఎలా ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రత్యామ్నాయం చూపాలని, లేనిపక్షంలో బాధిత కుటుంబాలు చేసే పోరాటాలకు బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, బాధిత కుటుంబాలు పాల్గొన్నారు.

## నేడే డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ప్రజాపక్షం/పాల్వంచ : పాల్వంచ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నేడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పనాధికారి కే. శ్రీధర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.మారుతీ అగ్రోటెక్ మరియు ఎక్స్‌క్యూటివ్ సంస్థ లో మొత్తం వంద ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. వీటిని భర్తీ చేయటానికి గానూ జాబ్‌మేళా ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 22 సంవత్సరాల నుండి 38 సంవత్సరాల వయసు గల పది, ఇంటర్, డిగ్రీ అర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థుల హాజరుశాతం పెంచాలి



ప్రజాపక్షం/పాల్వంచ : విద్యార్థులు వందశాతం పాఠశాలకు హాజరయ్యేలా కృషి చేయాలని జెడ్‌పి సిఈఓ నాగలక్ష్మిఅన్నారు. మండల పరిధి జగన్నాధపురంలోని ప్రైమరీ పాఠశాల బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మరుగుదొడ్లు, పాఠశాల పరిసరాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణంలో ఆహ్లాదకరమైన పూల మొక్కలను పెంచాలని సూచించారు.విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం అందజేయాలన్నారు. తయారు చేసిన ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం పెద్దమ్మతల్లి గుడివద్ద కమ్యూనిటీ సానిటరీ కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిలీంచారు. డ్రైనేజీ చివర ఇంకుడు గుంతల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని ఏఈ శ్రీనివాస్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కుడుముల విజయ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీరాంమూర్తి, ఏపిఓ పోరండ్ల రంగా, పాఠశాల ఉపాధ్యాయులు ఎన్.లత, వెంకటేశ్వరరావు, సుజాత పాల్గొన్నారు.

## నేడు కాల్వఒడ్డు మున్నేరు వంతెనపై ట్రాఫిక్ ఆంక్షలు

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : నగరంలోని కాల్వఒడ్డు మున్నేరుపై తీగల వంతెన నిర్మాణం కోసం భారీయంత్రాలను ఉపయోగిస్తున్న సందర్భంగా 20వ తేది గురువారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వంతెనపై రాకపోకలు నిలిపివేస్తూ అంక్షలు విధించినట్లు ట్రాఫిక్ సిఐ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాహనదారులు, ప్రజలు దినిని గుర్తించి ఆయా సమయాల్లో ప్రత్యామ్నాయ మార్గాల్లో రాకపోకలు సాగించాలని ఆయన సూచించారు. ప్రజలు ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.

## పెండింగ్ వేతనాలకై కార్మికుల ధర్నా



ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మున్సిపాలిటీ కార్మికులు గత ఆరు నెలలుగా పెండింగ్ వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని తమ వేతనాలను వెంటనే అందించాలని కోరుతూ బుధవారం మున్సిపాలిటీ కార్యాలయం ముందు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. గత ఆరు నెలలుగా వేతనాలు అందక కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని, వేతనాలను వెంటనే అందించి ఇబ్బందులను తొలగించాలని కోరారు. అసలే శ్రమదోపిడి వేతనాల కోసం ఇబ్బందుల తో ఆరు నెలలుగా అవస్థలు పడుతూ కుటుంబ భారం మోయలేకపోతున్నామని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా నిత్యవసరాలు కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడే సమయంలో ఆరు నెలలైనా వేతనాలను ప్రభుత్వం అందించడంలో నిర్లక్ష్యం వహిస్తుందని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు వేము రాంబాబు కోరారు. వేతనాలు అందించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని దీనిపై వెంటనే స్పందించనిచో దశల వారి ఆందోళనకు సిద్ధమవుతున్నామని అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కమిషనర్ సందీప్ కుమార్ కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఏఐటీయూసీ ఉపాధ్యక్షులు వేము రాంబాబు, పార్థసారథి, ఏఐటియుసి మండల నాయకులు దామాల దయాకర్ రావు తోపాటు మున్సిపాలిటీ కార్మికులు, ఉపాధ్యక్షులు ఊడల కృష్ణ, సహాయ కార్యదర్శి వజీర్మియా, నాయకులు ప్రకాష్, సుధాకర్ ,చిన్న, మణికుమార్ మున్సిపాలిటీ కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



ప్రజాపక్షం/ మధిర : మాజీ ప్రధాని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి పురస్కరించుకుని మధిర పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసిన నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందిరా గాంధీ భారత రాజకీయాల్లో అపూర్వమైన నాయకత్వం కనబరిచారని తెలిపారు. దేశాభివృద్ధి, జాతీయ ఐక్యత కోసం ఆమె చేసిన సేవలు చిరస్థాయిగా నిలిపోతాయని, ఆమె చూపిన మార్గంలోనే కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం, అభివృద్ధి లక్ష్యాలతో ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, సీనియర్ నాయకులు కర్నాటి రామారావు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మృత్యుంజయస్వామివారికి లక్ష బిల్వార్చన



ప్రజాపక్షం/ మధిర : దక్షిణ కాశిగా పేరుగాంచిన మధిర పట్టణంలోని శ్రీ మృత్యుంజయస్వామి ఆలయం నందు మహాశివునికి కార్తీక మాసం చివరిరోజు బుధవారం లక్ష బిల్వారర్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండే అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. దేవాలయం ఇఓ కొత్తూరు జగన్మోహన్‌రావు మహాశివునికి ఇష్టమైన మారేడు దళాలను మారేడు చెట్ల నుండి భక్తుల సహాయంతో లక్ష ఆకులను సేకరించి లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి శ్రీమాన్ రాయప్రోలు వెంకటసత్యనారాయణశర్మ, భక్తులు, దేవాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు కదిలి రండి



ప్రజాపక్షం/ముదిగొండః డిసెంబరు 26న ఖమ్మంలో జరిగే సిపిఐ శతాబ్ది ఉత్సవ ముగింపు సభకు ఊరూ వాడ కదలి వచ్చి జయప్రదం చేయాలని సిపిఐ మండల కార్యదర్శి రావులపాటి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వల్లభి, బాణాపురం గ్రామాలల్లో శతాబ్ది ఉత్సవ ముగింపు సభను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ 1925 డిసెంబరు 26న ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించబడి, భారత స్వాతంత్రోద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం, వేలాది ఎకరాల భూమి పేదలకు పంచడంలో సిపిఐ కీలక పాత్ర పోషిందన్నారు. సిపిఐ వందేళ్ల చరిత్ర అంతా పేదలు, అణగారిన వర్గాల పక్షాన పోరాటాలు చేసిందన్నారు. ఓట్లు, సీట్లు కోసం కాకుండా ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది సిపిఐ మాత్రమేనన్నారు. శతాబ్ది ఉత్సవ ముగింపు సందర్భంగా ఖమ్మంలో 10 లక్షల మందితో నిర్వహించే సభను ఊరూ వాడ కదలి వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సభకు 20 దేశాల పైగా ప్రతినిధులు, జాతీయ, ఆయా రాష్ట్రాల నాయకులు పాల్గొని ప్రసంగించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు పయ్యావుల లింగయ్య, మండల కార్యవర్గ సభ్యులు ఇరుకు చిన్నబాబు, గంగాధర బాబు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిల్లో ప్రసవాల సంఖ్యను పెంచాలి

**పిహెచ్‌సిని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ హస్పిటల్ లో ప్రసవాల సంఖ్య ను పెంచాలని జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్.పి.శ్రీజ సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ హస్పిటల్ ను ఆకస్మికంగా తనీఖీ చేశారు. హస్పిటల్ మొత్తం కలియతిరి రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ల్యాబ్, కాన్పుల గది, ఆపరేషన్ లు చేసే గదులను పరిశీలించారు. చెరువుమాధారం లోని పల్లె దవాఖాను ను పరిశీలించారు. పీహెచ్సీ ఏర్పాటు కు అవసరమైన చర్యలు గురించి చర్చించారు. అనంతరం సీహెచ్సీ లో వైద్యాధికారులతో ప్రత్యేక సమావేశం ను నిర్వహించారు. ప్రభుత్వ హస్పిటల్ ప్రసవాల సంఖ్య ను పెంచేందుకు అవసరమైన సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అందుకు అవసరమైనసౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అందుకు అవసరమైన వాటిని వెంటనే అంచనాలు వేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సీహెచ్సీ కి రోగుల సంఖ్య ఎక్కువైతున్నందున్న నేలకొండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ను చెరువుమాధారం కు తరలించాలని ఆదేశించారు. చెరువుమాధారం పల్లె దవాఖానా లో ఏర్పాటు చేయనున్న పీహెచ్సీ కి కనీస సౌకర్యాలు కల్పించేందుకు రూ.10 లక్షలతో అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ నెలాఖారు లోపు పీహెచ్సీ ని చెరువుమాదారం పంపించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రసవాలు పెంచేందుకు వైద్యాధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. హస్పిటల్ లో సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నేలకొండపల్లి సామాజిక ఆరోగ్య కేందర్రంలో మెరుగైన ""వైద్య సేవలు అందించేందుకు అవసరమైన వాటి కోసం అంచనాలు సిద్ధం చేయాలని పీఆర్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హస్పిటల్ ఆక్రమణ కు గురైందని విలువైన స్థలం ను స్వాధీనం చేసుకోవాలని సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ వినతి పత్రం అందించారు. తమకు పెండింగ్ వేతనాలు అందించాలని స్వీపర్లు వినతి పత్రం అందించారు. వివిధ సమస్యల పై స్థానిక కాంగ్రెస్ నాయుకురాలు మామిడి సుభద్ర వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్.కె.రాజశేఖర్, ఎంపీడీఓ యం.యర్రయ్య, మండల పంచాయతీ అధికారి సి.హెచ్.శివ, పంచాయతీరాజ్ డీఈఈ వంశీ, ఏఈ ప్రసాద్. వైద్యాధికారులు మంగళ. కె.రాజేష్. శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలి

**-మీడియా సమావేశంలో మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి రంగారావు**




**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రజల పక్షాన పోరాడే వారిని బూటకపు ఎన్‌కౌంటర్ల పేరుతో కాల్చి చంపుతున్నారని ఈ ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపించాలని సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు డిమాండ్ చేశారు. బుధవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాలకుల దుర్మార్గపు విధానాలను ప్రశ్నించే వారిని నిర్మూలించే పథకంలో భాగంగానే ఈ నరమేధం జరుగుతుందన్నారు. కగార్ పేరుతో మోడీ, అమిత్‌షాలు దేశంలో హత్యాకాండ కొనసాగిస్తున్నారని ఈ హత్యాకాండపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రంగారావు డిమాండ్ చేశారు. తక్షణం ప్రభుత్వ హత్యలను నిలుపుదల చేయాలని ఆయన కోరారు. చర్చలకు సిద్ధమన్న వారిని సైతం పట్టుకొచ్చి కాల్చి చంపుతున్నారని ఆయన తెలిపారు. డిసెంబర్ 26న కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి 100 ఏళ్లయిన సందర్భంగా 25న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని గ్రామాల్లోనూ పతాకావిష్కరణలు చేయాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 24న అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పార్టీ నిర్ణయించినట్లు రంగారావు తెలిపారు. మీడియా సమావేశంలో మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కెజి రాంచందర్, నాయకులు కెచ్చల రంగయ్య, కె. రమ, ప్రభాకర్, చంద్రన్న, రామయ్య, సదానందం, పీట్ల రామకృష్ణ, అశోక్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయంలో గోరింట, ముగ్గుల పోటీలు



**ప్రజాపక్షం/భద్రాచలం :** జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వారోత్సవాల్లో భాగంగా బుధవారం గోరింట, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా కార్యక్రమం జరిగింది. గ్రంధాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి మహిళా ఎస్సై అరుణ పాల్గొన్నారు. ఈ పోటీల్లో చిన్నారులు చక్కటి ముగ్గులు వేయగా, అందమైన గోరింటాకును చేతుల పై వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రంధాలయాలు ప్రత్యక్ష దేవాలయాలని, వాటిని పిల్లలు సద్వినియోగం చేసుకుంటే జీవితాలు అద్భుతంగా మారతాయని చెప్పారు. మహిళలు అక్షరాస్యులుగా మారాలని, అక్షరాస్యతతో కుటుంబాల్లో ఆనందాల్లు వెల్లు విరుస్తాయని చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో రానించాలని తద్వారా సమాజంలో మంచి స్థానం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో విజేతలను చుంచుపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సబిత ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గ్రంధపాలకురాలు మృదులతో పాటు మధుబాబు, రుక్మిణి, విద్యార్థినీలు పాల్గొన్నారు.

# రోడ్లు, డ్రైనేజీల మరమ్మత్తులు చేయాలి : బిఆర్ఎస్




**ప్రజాపక్షం/పాల్వంచ :** మండల పరిధి వివిధ గ్రామ పంచాయితీలలో ద్వంసమైన డ్రైనేజీలు, రోడ్ల మరమ్మత్తులను వెంటనే చేపట్టాలని పాల్వంచ సొసైటీ వైస్ చైర్మన్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నాయకులు కాంపల్లి కనకేష్, మంతపురి రాజుగౌడ్‌లు డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపు మేరకు ఆపార్టీ ఆధ్వర్యంలో ఎంపిడిఓ విజయభాస్కర్‌రెడ్డికి బుదవారం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా కానీ దెబ్బతిన్న రోడ్లపై తట్టెడు మట్టి పోసిన పాపాన పోలేదని విమర్శించారు.నూనత రహదారుల నిర్మాణం మరిచిపోయారని ఎద్దేవా వేశారు. పంచాయితీలలో పాలకవర్గం లేకపోవటంతో అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాహన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉంటాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రైనేజీలలో చెత్తా చెదారం, మురుగు నీరు నిలచి దుర్గంధం వెదజల్లుతున్నాయని, దీనితో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు రోగాల భారినపడి ఆసుపత్రులకు వేలకు వేలు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడిందని వాపోయారు. అధికారులు స్పంధించి వెంటనే రహదారులు, డ్రైనేజీలను మరమ్మత్తులు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాలేరు సింధు, సంగ్లోత్ రంజిత్, మారుముళ్ళ కిరణ్, పూజల ప్రసాద్, కొట్టె రాఘవేంద్ర, తోట లోహిత్, కాలేరు అఖిల్ మహర్షి, తోట ప్రవీన్, పోసారపు అరుణ్ కుమార్, మహమ్మద్ అదిల్, కుమ్మరికుంట్ల వినోద్, గిద్దలూరి శివసాయి, కూరెల్లి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు చేపట్టాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** మాదక ద్రవ్యాల నిర్మూలనకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. బుధవారం ఐడిఓసిలో జరిగిన సమావేశం లో ఆయన మాట్లాడుతూ గంజాయి. మత్తు పదార్థాల నివారణకు శాఖల వారిగా చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజల్లో అవగాహన పెంపు వంటి అంశాలపై చర్చించారు. పోలీస్ శాఖ నిర్వహిస్తున్న చైతన్యం కార్యక్రమం ద్వారా యువతలో అవగాహన పెరుగుతోందని, దీనిని మరింత విస్తరించజేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు వెంకటేశ్వర్లు, తుకారం రాథోడ్, వెంకట రమణ, పోలీస్, అటివి అధికారులు పాల్గొన్నారు.

# చిన్న నీటి వనరుల గణనను పకడ్బందీగా చేపట్టాలి

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** జిల్లాలోని చిన్న నీటి వనరుల గణనను పకడ్బందీగా చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో దేశవ్యాప్తంగా ఐదేళ్లకోసారి నిర్వహించే 7వ మైనర్ ఇరిగేషన్, రెండవవాటర్ బాడీస్ గణన కార్యక్రమాన్ని జిల్లాలో ఏవిధంగా అమలు చేయాలనే దానిపై జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలోని చిన్ననీటి పారుదల వనరుల గణనను సమగ్ర ప్రణాళికా బద్ధంగా పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా 2వేల హెక్టార్లలోపు విస్తీర్ణం గల జలవనరుల గణనను మొబైల్ అప్లికేషన్ ద్వారా మాత్రమే చేపట్టాలన్నారు. చెప్పారు. ముందుగా ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని నమూనా గణను పూర్తి చేసేన అనంతరం మిగతా గ్రామాల్లో గణన కొనసాగించాలని సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవ రావు, భూగర్భ జలాల అభివృద్ధిశాఖ అధికారి రమేష్, ఇరిగేషన్ ఇఇ అర్జున్ పంచాయితీ రాజ్ ఇఇ శ్రీనివాస్, ఎంపిఎస్ఓ సంబందిత అధికారులు పాల్గొన్నారు.

# చిన్నారులకు పలకలు, బుక్స్ పంపిణీ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి గుడ్ షెఫర్డ్ సంస్థ ఆధ్వర్యంలో బుధవారం అంగన్వాడి పాఠశాలలకు వెళుతున్న 40 మంది చిన్నారులకు పలకలు, బలపాలు, డ్రాయింగ్ బుక్స్, కాపీ రైటింగ్ బుక్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సిస్టర్ ఉదయ, సుజాత, సాగర్, ఆయా అంగన్వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. చైల్డ్ రైట్స్ వీక్‌లో భాగంగా మాదారం గ్రా మంలోని గాంధీ బాలల పార్లమెంట్ చైల్డ్ రైట్స్‌పై పోలీస్ సిబ్బంది తిరుపతి అవగాహన కల్పించారు. అనంతరం బాలల పార్లమెంట్ సభ్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పోలీస్ సిబ్బంది తిరుపతి, పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వరరావు, సిస్టర్ ఉదయ, సిబ్బంది పాల్గొన్నారు.

# దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలి




**ప్రజాపక్షం/ములకలపల్లి:** జిల్లా పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు, అశ్వారావుపేట నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ మెచ్చా నాగేశ్వరరావు పిలుపు మేరకు మండల అధ్యక్షులు మోరంపూడి అప్పారావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఎంపీడీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి మండల వ్యాప్తంగా దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని వినతి పత్రం అందించారు. ఈకార్యక్రమంలో నాయకులు శనగపాటి సీతారాములు, తాండ్ర రాంబాబు, తుర్రం శ్రీను, భూక్య ధర్మ, బైటి రాజేష్, వాడే నాగరాజు, కోండ్రు సుందర్‌రావు, తాటి ప్రవీణ్, బైటి రాము, గంగవరపు సుధాకర్, సూరం పుల్లారావు, తానం కృష్ణ, సున్నం సుశీల, వడ్డే హనుమంతరావు, పూరేటీ నర్సింహారావు, ఊరపెద్ది వెంకన్న, సున్నం రాజు, నునావత్ రమేష్, నున్న నాగబాబు, భూక్యా నంద, భూక్యా నాగరాజు, కుదుప శివయ్య, ఐతంరాజు నాగేశ్వరరావు, కొట్టే శేషు, పుప్పాల గోపి, కుంజా రాంబాబు, ఆదిమూలం యాదగిరి, ప్రమోద్ కుమార్, సిద్దెల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# బొల్లి సూరమ్మకు నివాళులర్పించిన ఎమ్మెల్యే జారే



**ప్రజాపక్షం/ఏన్కూరు :** బొల్లి సూరమ్మ చిత్రపటానికి ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నివాళులర్పించారు. మండల పరిధిలోని కాలనీ నాచారం గ్రామానికి చెందిన బొల్లి సూరమ్మ ఇటీవల అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ బుధవారం ఆమె దశదిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూరమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వరస లక్ష్మణ్, కత్రం నరసింహారావు, ఆర్ఎం రామయ్య, మల్కం వినోద్ కుమార్, వరుస నాగరాజు, పూసం సుధీర్, వాసం నరేష్, పాయం వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

**ప్రజాపక్షం/ములకలపల్లి:** పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో గౌరీ నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పత్తి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకొని మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.రైతాంగ సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాడతామని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, వూకంటి రవికుమార్, మాలోతు రావూజా, పోడియం వెంకటేశ్వర్లు, నిమ్మల మధు, గొగ్గల ఆదినారాయణ, కుంజా రామ్మూర్తి, గుగులోత్ దేవెందర్, కోండ్ర రాఘవయ్య, సోయం కృష్ణ, వర్సా శ్రీరాములు, బైరు ప్రసాద్, గుగులోతు రవీందర్, పద్దం తిరుపతమ్మ పాల్గొన్నారు.

# ఆకాశమే హద్దుగా మహిళలు ఎదగాలి

**-కోటి మందికి చీరలు పంపిణీ**
**-చిల్డ్రన్ హోమ్ నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన**
**-ఇందిరమ్మ చీరలు పంపిణీ చేసిన మంత్రి తుమ్మల**





**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ఆకాశమే హద్దుగా మహిళలు స్వశక్తితో ఎదిగేందుకు రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందిస్తుందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం రఘునాథపాలెం మండల కేంద్రంలో ఎంపిడివో కార్యాలయంలో రూ. 1.35 లక్షలతో నిర్మించనున్న బాలల సదన భవనానికి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ గరీబీ హటావో నినాదంతో పేదల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన మహా నాయకురాలు ఇందిరా గాంధీ అని తెలిపారు. ఇందిరా గాంధీ 108వ జయంతి సందర్భంగా మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. సామాన్యులకు, శ్రమజీవులకు మేలు చేస్తూ ఇందిరా గాంధీ పరిపాలనలో అనేక సంస్కరణలు అమలు చేశారన్నారు. ఇందిరమ్మ పాలన అంటే పేద ప్రజల పాలన అనే కీర్తిని సంపాదించుకున్నారని మంత్రి తెలిపారు. ఆర్థికపరమైన సమస్యలు ఉన్నప్పటికీ మహిళా సంక్షేమానికి కట్టుబడి అనేక కార్యక్రమాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. ఆర్టిసి బస్సులు, పెట్రోల్ బంక్‌లు, సోలార్ విద్యుత్ ప్లాంట్ వంటి అనేక రంగాల్లో మహిళలకు ప్రభుత్వం తోడ్పాటు నందిస్తుందన్నారు. పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులు కుట్టే బాధ్యతను కూడా మహిళా సంఘాలకు అప్పగించినట్లు తెలిపారు. సిరిసిల్లలోని చేనేత కార్మికులు తయారు చేసిన ఇందిరమ్మ చీరలను నవంబర్ 19 నుంచి డిసెంబర్ తొమ్మిది వరకు మొదటి విడత గ్రామీణ ప్రాంతాల్లో 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారన్నారు. ఖమ్మం జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో 18 ఏళ్లు నిండిన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మహిళా సంఘాల ద్వారా జిల్లా లో 1.27 లక్షల మంది ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టించి అందించడం జరిగిందన్నారు. ఖమ్మం జిల్లాలో 5.8 మెగావాట్ల సామర్థ్యంతో సోలార్ విద్యుత్ ప్లాంట్లను మహిళా సంఘాల ద్వారా ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మహిళా సంఘాలచే రూ. 35 కోట్ల నిధులతో పలు పాఠశాలలను అభివృద్ధి చేశామన్నారు. ప్రతి ఒక్క మహిళకు చీర అందిస్తామని తెలిపారు. మహిళా సంఘాల సభ్యులు మాట్లాడుతూ వడ్డీలేని రుణాలు, ఉచిత బస్సు ప్రయాణం, షీరాక్స్ సెంటర్, స్త్రీ టీ స్టాల్, మహిళా మార్ట్ వంటి అనేక మహిళా సంక్షేమ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం మంత్రి మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. రూ.54.13 కోట్ల బ్యాంక్ లింకేజీ రుణాల చెక్కును పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మి నారాయణ, జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కార్పొరేటర్లు, డిఆర్‌డివో సన్యాసయ్య, డిడబ్ల్యూవో రాంగోపాల్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ యాకోబ్, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ వెంకటరెడ్డి, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఈఈ పుష్పలత, తహసీల్దార్ శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, సొసైటీ ఛైర్మన్ తాతా రఘురాం, కాంగ్రెస్ మండల కన్వీనర్ వాంకుడోత్ దీపక్ నాయక్, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన పంట సత్వరమే కొనుగోలు చేయాలి

**- సంబంధిత అధికారులతో సమీక్షించిన మంత్రి తుమ్మల**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నాణ్యమైన పంట సత్వరమే కొనుగోలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తో కలిసి ధాన్యం, పత్తి పంటల కొనుగోలుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో నాణ్యత పరిశీలించి కొనుగోలు చేసిన తర్వాత రైస్‌మిల్లుల వద్ద ఎటువంటి కోతలు విధించడానికి వీలే లేదని స్పష్టం చేశారు. గన్ని సంచులు, టార్పాలిన్ కవర్లు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. ధాన్యం తేమ శాతం రాగానే వెంటనే కొనుగోలు పూర్తి చేసి రైస్ మిల్లులకు తరలించాలన్నారు. కౌలు రైతు వద్ద నుంచి కూడా పత్తి పంట మద్దతు ధరకు కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు అనుసరిస్తున్న విధానాన్ని పత్తి పంట కొనుగోలుకు పాటించాలన్నారు. తేమ శాతం గ్రామాల్లోనే చెక్ చేసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు డా॥ పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి డి. పుల్లయ్య, డిఎస్‌వో చందన్‌కుమార్, డిసివో గంగాధర్, సివిల్ సప్లయ్ డిఎం శ్రీలత, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో పర్యటించిన రాష్ట్ర విద్యాశాఖ బృందం



**ప్రజాపక్షం/జూలూరుపాడుః** మండలంలో బుధవారం రాష్ట్ర విద్యా శాఖ అధికారుల బృందం పర్యటించారు. రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకరాలు కె. వెంకట నర్సమ్మ ఆధ్వర్యంలో జూలూరుపాడు పెండ్యాల భాగ్యమ్మ మెమోరియల్ ప్రాథమిక పాఠశాల, పడమటి నర్సాపురం హై స్కూల్ ను సందర్శించారు. ప్రభుత్వం 5.0 అనే స్పెషల్ క్యాంపియన్ లో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలలు పరిశుభ్రంగా, పచ్చదనం, పాఠశాల ఆవరణము, మరుగుదొడ్లు, తరగతి గదులు, ఆఫీసు రూములు, పాఠశాల పరిశుభ్రంతో పిల్లలకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో 5.0 అనే స్పెషల్ క్యాంపియన్ ఏర్పాటు చేయటం జరిగినదని. రాష్ట్ర అధికారులు పాఠశాలను సందర్శించి పాఠశాలలో పనికి రాని, ఉపయోగపడని వస్తువులను వెంటనే తొలగించవలసిందిగా ఆదేశించారు. పడమటి నర్సాపురం హైస్కూల్ నందు మార్చిలో జరిగే పదవ తరగతి పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధులను చేయవలసిందిగా సూచించారు. రాష్ట్ర విద్యాశాఖ పరిశీలకురాలు కె వెంకట నరసమ్మ, జాయింట్ డైరెక్టర్ హైదరాబాద్ వారి వెంట ఎ.ఎంఓ. నాగ రాజశేఖర్, డిస్ట్రిక్ట్ ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, భద్రాద్రి కొత్తగూడెం విద్యాశాఖ కమ్యూనిటీ కోఆర్డినేటర్ ఎస్కే సైదులు, మండల నోడల్ ఆఫీసర్ పి సంజీవరావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు టి లక్ష్మీ నరసయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి నేతాజీ, సీతారాములు, జిదుల మహేష్, ధరావత్ నవనీత, సాంబశివరావు, జక్కుల శ్రీనివాసరావు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

# సమాజాన్ని అభిమానించే జాతిగా కమ్మవారు ఉండాలి

**- కాకతీయ కమ్మ వనసమారాధనలో మంత్రి తుమ్మల**



**ప్రజాపక్షం/ మధిర :** సమాజాన్ని అభిమానించే జాతిగా కమ్మవారు ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. బుధవారం ఆత్కూరు గ్రామంలోని అబ్బూరి వారి మామిడితోటలో కాకతీయ కమ్మ వనసమరాధాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మన పూర్వీకులు ఇచ్చిన ఘన కీర్తిని కొనసాగించాలన్నారు. సమాజాభివృద్ధికి కమ్మ వారు ఎంతోగానో కృషి చేస్తున్నారని, కమ్మవారందరూ ఐక్యంగా ఉంటూ ఇతర కులాల వారు ఆదర్శంగా తీసుకునే విధంగా ఉన్నత విలువలతో జీవించాలని సూచించారు. కాకతీయ కమ్మ ఆధ్వర్యంలో వన సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన నిర్వాహకులు అభినందించారు. అనంతరం నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో మంత్రి తుమ్మలను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కమ్మవారంతా సందడి చేస్తూ ఉత్సాహంగా గడిపి సహపంక్తి భోజనాలు చేశారు. అనంతరం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ప్రముఖ వైద్యులు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, ప్రముఖులు పుతుంబాక కృష్ణప్రసాద్, చావా రామకృష్ణ, కరివేద వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ శతాబ్ది ఉత్సవాల ముగింపు సభను జయప్రదం చేయండి




**ప్రజాపక్షం/వైరాః** సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలను జయప్రదం చేయాలని ఈ నెల21వ తారీఖున వైరా నియోజకవర్గంలో ప్రచారం నిమిత్తం హైదరాబాద్ నుండి జాతా వస్తున్న సందర్భంగా తనికెల్ల విజయ కాలేజి దగ్గరకు మధ్యాహ్నం రెండు గంటలకు కార్యకర్తలందరూ చేరుకొని ఘనస్వాగతం పలకాలని వైరా నియోజకవర్గ ఇంచార్జి యర్ర బాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా యర్రా బాబు మాట్లాడుతూ ఈ జాతరకు రాష్ట్ర ఎమ్మెల్సీ కామ్రేడ్ నెల్లికంటి సత్యం, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాలనరసింహ, కార్యదర్శి వర్గ సభ్యులు బాగం హేమంతరావు, మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు పాల్గొంటున్నారు. కావున ఇట్టి జాతాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుదవారం వైరా సిపిఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం యామాల గోపాలరావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి మూల కొండా, పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, కొండా రామకృష్ణ, ఏఐటియుసి నాయకులు అంజయ్య, సీతారాములు, హుస్సేన్, రామకృష్ణ, ముత్తయ్య, మున్సిపాల్ వర్కర్స్ యూనియన్ నాయకులు రాయపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా ఉండాలి



**ప్రజాపక్షం/వైరాః** వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో లయన్ నూకల శ్రీనివాసరావు పుట్టినరోజు వేడుకలు వైరా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు వై.బుచ్చి రామారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పుట్టినర్జో సందర్భంగా వేద పాఠశాలకు బియ్యం, కూరగాయలను వేద పాఠశాల పిల్లలకు దుప్పట్లు, నిరుపేదలకు 40 మందికి రగ్గుల పంపిణీ చేశారు. పుట్టినరోజు పురస్కరించుకొని నూకల శ్రీనివాసరావు, వాణిశ్రీ దంపతులను వేద పండితులు దుర్భాకుల కుమార్‌శర్మ అవధాని ఆశీర్వదించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. ఈ సందర్భంగా వైరా మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ళ గంగారావు మాట్లాడుతూ వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా అనేక సేవా కార్యక్రమాలను అందిస్తూ అన్ని వర్గాల వారి ఆదరాభిమానాలు చూరకుంటున్నారని, క్లబ్ సభ్యులు పుట్టినరోజు, పెళ్లిరోజు కార్యక్రమాల్లో సేవలందించడం పట్ల ఆయన ప్రశంసించారు. నిరుపేదలకు అండగా ఉండటం ఎంతో సంతోషంగా ఉంటుందని, వర్తక సంఘం అధ్యక్షులు వనమా విశ్వేశ్వరరావు, మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జున్‌రావు అన్నారు. అదేవిధంగా ఎంతోమంది నిరుపేదలను విద్యార్థులను లయన్స్‌క్లబ్ ద్వారా సేవలందించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు వనమా విశ్వశ్వరరావు, ఆర్యవైశ్య కళ్యాణ మండపం అధ్యక్షులు డాక్టర్ పెరుమాళ్ల కృష్ణమూర్తి, మాజీ ఎంపిపి కట్టా కృష్ణార్జున్‌రావు, చింతలపూడి వెంకటేశ్వరరావు, నూకల ప్రసాదరావు, అన్నపూర్ణ దంపతులు, గజ్జల కృష్ణమూర్తి, మణి, మిట్టపల్లి కిరణ్‌కుమార్, రంగా రమేష్, మిట్టపల్లి రాఘవరావు, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, కొణతాలపల్లి సుబ్బారావు, కొణతాలపల్లి నగేష్, పోశం శ్యామ్‌కుమార్, ఎంద్రపుడి శంకర్, రంగా సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ సీనియర్ నాయకుడు మేడా భూషయ్య మృతి



**ప్రజాపక్షం/ఏన్కూరు :** ఏన్కూరు గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు మేడభూషయ్య బుధవారం మృతి చెందారు. ఆయన గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఖమ్మం లో ప్రేవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ మరణించారు. కమ్యునిస్ట్ పార్టీ కి నిబద్ధత కల్గిన నాయకుడిగా తన తుది శ్వాస విడిచే వరకు మండల సీనియర్ నాయకుడిగా సలహాలు సూసనలు ఇస్తూ పార్టీ ఇచ్చే అన్ని కార్యక్రమాల్లో పాల్గొని యువతకు స్ఫూర్తినిచ్చారు. గ్రామాల్లో పార్టీని పెంచడంలో కీలక పాత్ర పోషించారు. గ్రామ, మండల, జిల్లా రైతు సంఘం నాయకుడిగా తన పాత్ర నిర్వహించారు.ఆయన మృతికి సీపీఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరావు, రాష్ట కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంత్ రావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్ సంతాపం ప్రకటించారు. రేపు అనగా (గురువారం) 10 గంటలకు అంత్రేక్రియలు జరుగుతాయని రాష్ట, జిల్లా నాయకులు పాల్గొంటున్నారని మండల కార్యదర్శి జాగర్లమూడి రంజిత్ కుమార్ తెలిపారు.